క్లుప్తంగా

మూలాంకురేశ్వరికి ఖడ్గమాలపూజలు



ఫిరంగిపురం: మండలంలోని అమీనాబాద్ గ్రామంలోని మూలాంకురేశ్వరి అమ్మవారికి పాల్గుణ బహుళ అమావాస్యను పురస్కరించుకొని అర్చకులు అయ్యన్న శాస్త్రి శనివారం విశేషపూజలు చేశారు. ఉదయాన్నే అమ్మవారికి పంచామృతాలతో అభిషేకంచేసి నూతనవస్త్రాలతో అలంకరించారు. దుర్గాఅష్టోత్తర, సహస్త్రనామాలతో కుంకుమార్చనలు చేశారు. మండపంలోని అమ్మవారి పాదుకలకు దేవీస్తోత్రాలతో ఖడ్గమాలపూజలు నిర్వహించి అఖండహారతి సమర్పించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

నూతక్కిలో ఉచితంగా వైద్య పరీక్షలు



మంగళగిరి: నగర పరిధిలోని నూతక్కిలో కేఎల్ డీమ్డ్ విశ్వవిద్యాలయం, పలు ప్రైవేటు ఆసుపత్రుల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 500 మంది రోగులకు బీపీ, షుగరు, ఎముకలు, దంతాలు, కంటి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కేఎల్ విశ్వవిద్యాలయం విద్యార్థి సంక్షేమ అధిపతి డాక్టర్ చప్పిడి హనుమంతరావు, విద్యార్థి వ్యవహారాల సలహాదారు డీన్ డాక్టర్ హబీబుల్లాఖాన్, విద్యార్థి వ్యవహారాల అసోసియేట్ డీన్ డాక్టర్ రూతు రమ్యలు మాట్లాడుతూ ఆసుపత్రులు, వర్సిటీ సంయుక్తంగా దత్తత గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి స్థానిక ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఛాన్సలర్ డాక్టర్ పార్థసారథివర్మ, ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎన్ వెంకట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె జగదీష్, సాక్ డైరెక్టర్ పి సాయి విజయ్, విద్యార్థుల వ్యవహారాల డీన్ డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్‌లతోపాటు పలువురు వైద్యులు పాల్గొన్నారు.

యూపీహెచ్‌సీ వైద్యునిగా రాజేష్ బాధ్యతల స్వీకారం



మంగళగిరి: మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధి యర్రబాలెంలోని డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యునిగా డాక్టర్ రాజేష్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ వైద్యునిగా విధులు నిర్వర్తించిన డాక్టర్ సయ్యద్ ముస్తఫా గత నెల 21వ తేదీన నిజాంపట్నం క్లస్టర్‌కు బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో 104 విభాగంలో వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ రాజేష్ యర్రబాలెం యూపీహెచ్‌సీకి బదిలీపై వచ్చారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ రాజేష్‌కు ఎంపీహెచ్‌ఈఓ మనోహర్‌తోపాటు పలువురు వైద్య సిబ్బంది అభినందనలు తెలిపారు.

ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా

తాడేపల్లిరూరల్:తాడేపల్లి రూరల్ పరిధిలోని కొలనుకొండలో గంగానమ్మ పేటలో శనివారం తాగునీటి సమస్య ఏర్పడింది. వెంటనే స్పందించిన సచివాలయ సిబ్బంది కార్పొరేషన్ అధికారులతో మాట్లాడి ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేశారు. ఆదివారం ఉదయానికల్లా పైప్‌లైన్లు మరమ్మతులు పూర్తిచేసి తాగునీటిని అందించనున్నట్లు ఇంజినీరింగ్ సిబ్బంది తెలిపారు.

నేడు ఛాంబర్ ఆఫ్ కామర్స్ సమావేశం

మంగళగిరి: నగరంలోని మెయిన్ బజారు ఆర్య వైశ్య కల్యాణ మండపంలో ఆదివారం ఉదయం 11 గంటలకు ఛాంబర్ ఆఫ్ కామర్స్ సమావేశం నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు సంకా బాలాజీ గుప్తా ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జీఎస్‌టీ చట్టంలో వచ్చిన నూతన మార్పులు, ఆచరణాత్మక ఇబ్బందుల గురించి సమావేశంలో చర్చిస్తామని తెలిపారు. సమావేశంలో ఎస్‌జీఎస్‌టీ జాయింట్ కమిషనర్ మధుబాబు, అసిస్టెంట్ కమిషనర్ కోట శ్రీధర్, సూపరింటెండెంట్ ఆఫ్ సీజీఎస్‌టీ బి.కుమార్ తదితరులు హాజరవుతారని తెలిపారు.సభ్యులందరూ హాజరుకావాలని కోరారు.

మోటర్ల చోరీకి పాల్పడే ఇద్దరి అరెస్టు

- నాలుగు మోటర్లు రికవరీ
- రూ.55 వేల నగదు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సీఐ శేషగిరిరావు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ శేషగిరిరావు, పక్కన ఎస్‌ఐలు వినోద్, రమేష్, నిందితుడు(ముసుగు వేసుకున్న వ్యక్తి)

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఇటీవల కాలంలో విద్యుత్ మోటర్లు, పరికరాలు చోరీకి పాల్పడ్డ ఇరువురిని తాడేపల్లి పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. సీఐలు శేషగిరిరావు, సాంబశివరావులు తెలిపిన వివరాల ప్రకారం.. తాడేపల్లి రూరల్ పరిధిలోని పెనుమాకలో ఈనెల 12వ తేదీన పంటపొలాల్లో బిగించిన ఉన్న విద్యుత్ మోటర్లు చోరీకి కావడంతో రైతులు ఫిర్యాదు చేశారు. విజయవాడలోని బీఆర్‌టీఎస్ రోడ్డులోని ఓ దుకాణంలో విద్యుత్ మోటర్లను గుర్తించిన రైతులు పోలీసులకు సమాచారం అందించారు. తాడేపల్లి ఎస్‌ఐలు వినోద్, రమేష్, క్రైం సిబ్బంది సంఘటనా స్థలానికి వెళ్లి షాపు యజమాని సుబ్బారెడ్డిని అదుపులోకి తీసుకుని విచారించారు. దుకాణంలోని సీసీ కెమెరాల ఆధారంగా అమ్మిన వ్యక్తిని గుర్తించారు. శుక్రవారం రాత్రి గుండిమెడ శివారులో అనుమానాస్పద స్థితిలో తిరుగుతున్న మంగళగిరికి చెందిన సుబ్రహ్మణ్యంను అదుపులోకి తీసుకుని విచారించారు. పెనుమాకలో దొంగతనం చేసి విజయవాడలో మోటర్లు విక్రయించినట్లు తెలిపాడు. తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరంలో 7–6–2022న విద్యుత్ శాఖకు చెందిన ఎలక్ట్రికల్ వస్తువులను దొంగిలించాడని, దానికి సంబంధించి రూ.55 వేల నగదును అతని వద్ద స్వాధీనం చేసుకున్నారు. 10–3–2022న కొలనుకొండ వద్ద రెండు విద్యుత్ మోటర్లు, పెనుమాకలో మరో రెండు విద్యుత్ మోటర్లు మొత్తం నాలుగు విద్యుత్ మోటర్లను రికవరీ చేశామని, ఇతనితోపాటు మంగళగిరి గండాలయ్యపేటకు చెందిన ఒక మైనర్ బాలుడు కూడా సహకరించడంతో వారిద్దరిని అరెస్టుచేసి కోర్టుకు హాజరు పరిచినట్లు సీఐ తెలిపారు. కేసును ఛేదించిన ఎస్‌ఐలు రమేష్, వినోద్‌లను, క్రైం సిబ్బంది కొండలరావు, కళ్యాణ్, బాబూరావు ఇతర సిబ్బందిని సీఐలు శేషగిరిరావు, సాంబశివరావు అభినందించారు.

కొనసాగుతున్న పెదకోనేరు పునరుద్ధరణ పనులు

పరిశీలించిన ఎమ్మెల్యే ఆర్కే



పెద కోనేరు పునరుద్ధరణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)

మంగళగిరి: స్థానిక పానకాల లక్ష్మీ నృసింహస్వామి దేవస్థానానికి చెందిన పెద కోనేరు (కల్యాణ పుష్కరిణి) పునరుద్ధరణ పనులను ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) దేవస్థాన ఈవో ఎ.రామకోటిరెడ్డితో కలసి శనివారం పరిశీలించారు. ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ భావి తరాలకు చరిత్రను అందించాలనే బలమైన సంకల్పంలో భాగంగా పెదకోనేరు పునరుద్ధరణ పనులకు శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. సుమారు రూ.1.50 కోట్ల నిధులతో చేపట్టిన పెద కోనేరు పునరుద్ధరణ పనులకు నిధులు చాలకుంటే ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి అదనపు నిధులు కేటాయించేలా తన వంతు కృషి చేస్తానని తెలిపారు. పెద కోనేరులో తొలగిస్తున్న మురుగును ట్రాక్టర్లతో తరలిస్తున్న క్రమంలో ఎక్కడా రోడ్డుపై పడకుండా చర్యలు తీసుకోవాలని దేవస్థాన అధికారులకు సూచించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ కన్వీనర్ మునగాల మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఈమనిలో రీ సర్వేపై గ్రామసభ

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): దుగ్గిరాల మండల పరిధిలోని ఈమని గ్రామంలో తహసీల్దార్ మల్లేశ్వరి రీ సర్వేపై శనివారం గ్రామసభ నిర్వహించారు. ఆమె రైతులతో మాట్లాడుతూ ఈమని గ్రామంలోని వ్యవసాయ భూములకు సంబంధించి ఇప్పటివరకు వెబ్‌ల్యాండ్‌లో నమోదు కాని రైతులు ఎవరైనా ఉన్నా, భూమి కలిగిన రైతులు ఎవరైనా మరణించి ఉన్నా వారి కుటుంబ సభ్యులు పార్టిషన్ చేసుకున్న డాక్యుమెంట్లు తీసుకుని సంబంధిత వీఆర్వోని కలసి వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఉజ్వల హరిణి, పంచాయతీ కార్యదర్శులు సతీష్, జ్యోత్స్న, గ్రామ రెవెన్యూ అధికారులు బుల్లెమ్మాయి, రత్నకిషోర్, గ్రామ వలంటీర్లు, గ్రామ రెవెన్యూ సహాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మిద్దె పంటల పెంపకంతో రసాయన రహిత కూరగాయలు

ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై మహిళలకు అవగాహన



లాం గ్రామంలో మిద్దెతోటను పరిశీలిస్తున్న ప్రకృతి వ్యవసాయ విభాగం సభ్యులు

లాం(తాడికొండ): ప్రకృతి వ్యవసాయ పద్ధతులలో రసాయన రహితంగా ఇంటి వద్దనే రసాయన రహితంగా కూరగాయలు పండించడం ద్వారా మంచి ఆరోగ్యం సొంతం చేసుకోవచ్చని ప్రకృతి వ్యవసాయ విభాగం యూనిట్ ఇన్‌ఛార్జి ఝాన్సీలక్ష్మి అన్నారు. శనివారం తాడికొండ మండలం లాం గ్రామంలోని లాలాది వెంకటకుమారి గృహంపై రసాయన రహితంగా పండించిన మిద్దెతోటను పలువురు గ్రామస్తులతో కలిసి ఆమె పరిశీలించారు. ఎలాంటి రసాయనాలు లేకుండా తమ పర్యవేక్షణలో పురుగుమందులు బదులుగా కషాయాలు, ఘన, ద్రవ జీవామృతాలు వాడి విషరహిత ఆహారాన్ని అందరూ తీసుకోవచ్చనే విషయం పలువురికి వివరించారు. ప్రతి ఒక్కరూ ఈ విధానాలను పాటించేలా సమగ్ర అవగాహన కల్పించే దిశగా తమ ప్రకృతి వ్యవసాయ విభాగం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో టీఆర్‌పీలు నాగరాజు, ఐసీఆర్పీలు పలువురు మహిళలు పాల్గొన్నారు.

తాడేపల్లి తహసీల్దార్ బదిలీ



తాడేపల్లిరూరల్: తాడేపల్లి తహసీల్దార్‌గా పనిచేసిన శ్రీనివాసులురెడ్డి బదిలీ అయ్యారు. ఆయనకు డిప్యూటీ కలెక్టర్‌గా ఉద్యోగోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. విజయవాడ టూరిజం రీజనల్ డైరెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీచేసింది. శ్రీనివాసులురెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టనున్నారు.

శరవేగంగా అభివృద్ధి పనులు

తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలోని ప్రభుత్వం కేటాయించిన స్పెషల్ గ్రాంట్ నుంచి కొలనుకొండలో అభివృద్ధి పనులను చేపట్టారు. శనివారం కొలనుకొండలోని పలు ప్రాంతాల్లో రూ.70 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను నిర్వహిస్తున్నారు. ఈ పనులు శరవేగంగా జరుగుతున్నాయని స్థానికంగా ఉన్న సచివాలయ సిబ్బంది నాణ్యతా ప్రమాణాలను పరిశీలిస్తున్నట్లు కొలనుకొండ ఇంజినీరింగ్ అసిస్టెంట్ క్రాంతి తెలిపారు. రెండు మూడు రోజుల్లో పనులు పూర్తికానున్నట్లు తెలిపారు.

నేడు సినీ సంగీత విభావరి

పాత గుంటూరు: చిష్టీస్ కల్చరల్ ఈవెంట్స్, మధువని సుస్వరాల పల్లకి సంయుక్త ఆధ్వర్యంలో రాజాగారి తోటలోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఆదివారం సుస్వరాల జల్లు పేరుతో సినీ సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఎండీ. పర్వేజ్ చిష్టి, మధుబాబు తెలిపారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

మంగళగిరి: నగరానికి చెందిన దామర్ల శివరామకృష్ణ, రామసీతమ్మ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 9గంటలకు స్థానిక రాజీవ్ గృహకల్ప సమీపంలోని రామాలయం వద్ద ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సేవా ట్రస్టీ డీఎస్ఎస్ శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ వైద్య శిబిరంలో వివిధ ఆరోగ్య సమస్యలకు సంబంధించి వైద్య నిపుణులు పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా అందజేయనున్నట్లు తెలిపారు. కంటి వైద్య నిపుణులు డాక్టర్ కొల్లి నాగేశ్వరరావు, ఎముకలు, కీళ్లు, జాయింట్ నిపుణులు డాక్టర్ జాన్ షాహీద్, చెవి, ముక్కు వైద్య నిపుణులు డాక్టర్ బాలసుబ్రహ్మణ్యం, జనరల్, మూత్రపిండాల వైద్య నిపుణులు ఎండీ అస్లాం, దంత వైద్య నిపుణులు చింతక్రింది చక్రవర్తి వైద్య పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. నగర ప్రజలు సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శని అమావాస్య పూజలు



మంగళగిరి: నగరంలోని పానకాల లక్ష్మీ నరసింహస్వామి దేవస్థాన కొండ శిఖర భాగంపై వేంచేసియున్న గండాలయ స్వామి వారి గండదీపం వద్ద శనివారం శని అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులు గండదీపం వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శని అమావాస్య కావడంతో భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారిని దర్శించుకుని గండదీపం వెలిగించి టెంకాయలు కొట్టి కర్పూర నీరాజనాలు సమర్పించి పూజలు నిర్వహించారు. పలువురు దాతలు భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. దేవస్థాన ఈఓ అన్నపురెడ్డి రామకోటిరెడ్డి పర్యవేక్షించారు.

ప్రకటన

నా క్లయింటు M/s. Shriram Finance Ltd., Machilipatnam Branch వారి పంజాయిషీ పొంది యావన్మందికి తెలియజేయునది ఏమనగా...

గుంటూరుజిల్లా, మంగళగిరి మండలం బేతపూడి గ్రామ కాపురస్తులు బండారు వీరాస్వామి గారి కుమారుడు బండారు శ్రీనివాసరావు గారు ది.29-01-2015వ తేదీన అడపా వెంకటేశ్వర్లు గారి కుమారుడు అడపా సాంబయ్య గారి వద్ద నుండి దస్తావేజు నెం. 1156/2015 (ఎస్.ఆర్.ఓ. మంగళగిరి) ద్వారా క్రయం పొందిన ఈ దిగువ షెడ్యూలు ఆస్తిని మార్చు గేజ చేసుకొని బండారు శ్రీనివాసరావు గారి సోదరి వెనిగళ్ళ నాగమణి గారి పేరు మీద లోను పొందగోరియున్నారు. సదరు వెనిగళ్ళ నాగమణి గారి పేరు మీద లోను ఇవ్వబడుటకై ఎవరికైనను ఎటువంటి కోర్టు ఎటాచ్‌మెంట్లు గాని, క్రయములు గాని మరియు ఏ ఇతర అభ్యంతరములు వున్న యెడల వారి అభ్యంతరములను ఈ క్రింది అడ్రస్సుకు 7 రోజులలో Regd. Post with Ack Due ద్వారా తెలియజేయగలరు. అట్టి విన్నపాలు క్రయములు గాని, అభ్యంతరములు గాని నా క్లయింటుకు బైండ్ చేయజాలవని యావన్మందికి తెలియజేయుడమైనది.

షెడ్యూలు: గుంటూరు డి. మంగళగిరి సబ్-డి యిలాకా మంగళగిరి మండలం, నవులూరు శివారు, బేతపూడి గ్రామ పంచాయతీ పరిధిలో చేరిన బేతపూడి గ్రామ సర్వే నెం.369, పట్టా నెం.5-165. ప్లాటు నెం.4రు దాఖలా చ.గ. 84.33 ల ఖాళీ నివేశన స్థలమునకు సరిహద్దులు: తూర్పు: మూడల విజయ వర్దిగారి అర్బ్ హద్దు, దక్షిణం: ప్లాటు నెం.3రు తాలూకు స్థలం హద్దు, పడమర: సర్వాదు రోడ్ హద్దు, ఉత్తరం: నా తాలూకు మిగులు స్థలం హద్దు.

T.V.N. VASUDEVA RAO, Advocate
Gudivadavari St., VIJAYAWADA.
Ph:9849431432

ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య

మంగళగిరి: ఓ వివాహిత ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని యర్రబాలెం శివకామేశ్వరి దేవాలయం సమీపంలో చోటుచేసుకుంది. మంగళగిరి రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు... రేపల్లెకు చెందిన కొలసాని చైతన్య, మహాలక్ష్మి(35) దంపతులు ఆరేళ్ల కిందట బతుకుదెరువు నిమిత్తం యర్రబాలెం వలస వచ్చారు. వీరికి ఇద్దరు పిల్లలు. వేప చెట్టు సెంటర్‌లో టిఫిన్ హోటల్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. గత కొంతకాలంగా మహాలక్ష్మి మానసిక వ్యాధితో బాధపడుతోంది. టిఫిన్ హోటల్‌ను నిలిపివేసి ఆమెకు ప్రత్యేక వైద్యం చేయిస్తున్నాడు. కాలక్రమేణా మహాలక్ష్మి ఆరోగ్యం కుదుటపడటంతో నగరంలోని ఆత్మకూరు జాతీయ రహదారి వెంబడి చైతన్య టిఫిన్ హోటల్‌ను తిరిగి నిర్వహించుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో భార్యాభర్తల మధ్య మనస్పర్థలు చోటుచేసుకోవడంతో శనివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆమె ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మంగళగిరి రూరల్ ఇన్‌చార్జి ఎస్‌ఐ శ్రీనివాసరెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

23న జరిగే ధర్నాను జయప్రదం చేయండి

సీపీఎం జిల్లా కార్యదర్శి పి.రామారావు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 23వ తేదీ ఉదయం 10 గంటలకు మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు పిలుపునిచ్చారు. శనివారం పట్టణ పరిధిలోని బోటుయార్డు వద్ద గల పుష్కర కాలనీ, సీతానగరం, కెఎల్‌రావు కాలనీ ప్రాంతాల్లో సీపీఎం నాయకులతో కలసి ఆయన పర్యటించారు. ఆయన మాట్లాడుతూ 2016 పుష్కరాల సందర్భంగా ఘాట్లు, రోడ్ల నిర్మాణం కోసం ఇళ్లు తొలగించిన సుమారు 300 మంది పేదలకు ప్రత్యామ్నాయ స్థలాలు ఇంతవరకు కేటాయించలేదని అన్నారు. పుష్కర బాధితుల కాలనీలో మురుగు నీటి సమస్యను పరిష్కరించి రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. కేఎల్ రావు కాలనీలో కల్వర్టు పూడిక తీయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం తాడేపల్లి పట్టణ నాయకులు కొట్టే కరుణాకరరావు, సోలా ముత్యాలరావు, దొంతిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి, కట్టా మేరి, వెంపాటి శామ్యేల్ తదితరులు పాల్గొన్నారు.

కేఎల్‌యూలో క్యాప్‌స్టోన్ ప్రాజెక్ట్ ప్రారంభం

వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో విదేశీ పూర్వవిద్యార్థుల సంఘం ద్వారా విద్యార్థుల కోసం క్రెడిట్ ఆధారిత క్యాప్‌స్టోన్ ప్రాజెక్ట్‌ను శనివారం నిర్వహించినట్లు విశ్వవిద్యాలయ వైస్‌చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ తెలిపారు. ఈ అంతర్జాతీయ పూర్వ విద్యార్థుల వర్క్‌షాప్ వర్చువల్ సదస్సులో పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు మొత్తం 110 మంది పాల్గొన్నారు. కార్యక్రమంలో పరిశ్రమ నిపుణులు కిరణ్ పల్లా, సిఐఓ నెట్‌వర్క్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడు (1988–92 మెకానికల్), రామ్ మోర్ల డేటా ఎంటర్‌ప్రైజెస్ హెడ్, చిగురుపాటి సత్య ఆర్కిటెక్చర్ ఇన్ కాగ్నిజెంట్ (1986–90) తదితరులు తమ అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. విద్యార్థులకు విలువైన సలహాలు, మార్గదర్శకాలను అందించిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. పూర్వ విద్యార్థుల సంబంధాల డైరెక్టర్ డాక్టర్ కెసీహెచ్ శ్రీకావ్యను అభినందించారు. కార్యక్రమంలో ప్రొ.వి.సి. డాక్టర్ ఎన్.వెంకట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎ.జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయండి

కమిషనర్ కీర్తి చేకూరి




అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని, నెలాఖరు కల్లా శ్లాబ్‌ల నిర్మాణం జరగాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి లబ్ధిదారులకు చెప్పారు. ఆమె శనివారం లాం గ్రామంలోని జగనన్న లే అవుట్‌లో ఇళ్ల నిర్మాణాల పురోగతిని ఆర్డీఓ, గృహ నిర్మాణ, నగరపాలక సంస్థ అధికారులతో కలసి పరిశీలించారు. ముందుగా లే అవుట్స్‌లో మంజూరైన ఇళ్లు, నిర్మాణంలో ఉన్న వాటి సంఖ్య వివరాలను హౌసింగ్ ఈఈ కమిషనర్‌కు వివరించారు. లే అవుట్ రహదార్లకు మరమ్మతులు చేపట్టాలని ఆమె ఆదేశించారు. లెవలింగ్ కోసం అవసరమయ్యే గ్రావెల్‌ను స్థానిక తహసీల్దార్‌తో సమన్వయం చేసుకోవాలని చెప్పారు. ఇళ్ల నిర్మాణ కాంట్రాక్ట్ పొందిన కాంట్రాక్టర్ ప్రతి రోజు 30 ఇళ్ల బేస్మెంట్ లెవల్ ఇచ్చేలా చూడాలని చెప్పారు. లబ్ధిదారుల ప్లాట్‌లు, లైన్లు కనిపించేలా మార్కింగ్ చేయాలని, అందుకు ప్లానింగ్ కార్యదర్శులను కేటాయించాలని సిటీప్లానర్‌ని ఆదేశించారు. విద్యుత్ లైన్ల వేసేందుకు ఆ శాఖాధికారులతో సమన్వయం చేసుకోవాలని చెప్పారు. లే అవుట్‌లో నగరపాలక సంస్థ నుంచి చేపట్టాల్సిన పనుల వేగవంతానికి డీఈఈ స్థాయి అధికారుల్ని ప్రత్యేకంగా నియమించి, ప్రతి రోజూ పర్యవేక్షణ చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ ఎం.ప్రభాకరరెడ్డి, నగరపాలక సంస్థ ఎస్ఈ భాస్కర్, డీఈఈ మహ్మద్ రఫీక్, హౌసింగ్ ఈఈ శంకరరావు, డీఈఈ ఆంజనేయులు, తాడికొండ తహసీల్దారు ఫణీంద్రబాబు, సచివాలయ ఎమినిటీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నేడు కేంద్ర వైద్య ఆరోగ్య సహాయ మంత్రి మంగళగిరి రాక

మంగళగిరి: కేంద్ర వైద్య ఆరోగ్య సహాయ మంత్రి భారతీ ప్రవీణ్ పవార్ ఆదివారం మంగళగిరి వస్తున్నట్లు డీపీఆర్ఓ కార్యాలయం శనివారం ఒక ప్రకటనలో పేర్కొంది. మధ్యాహ్నం 2.30 గంటలకు నగరంలో వేంచేసియున్న శ్రీ లక్ష్మీనృసింహస్వామి వారిని ఎగువ, దిగువ సన్నిధుల్లో దర్శించుకుని అనంతరం చిల్లపల్లి నాగేశ్వరరావు కల్యాణ మండపంలో జరిగే బీజేపీ కార్యకర్తల సమావేశంలో మంత్రి పాల్గొంటారని తెలిపారు.

ముగిసిన పునీత ఆగ్నేసమ్మ ఆలయ వార్షికోత్సవం



మేడికొండూరు: మండలంలోని పేరేచర్ల గ్రామంలోని పునీత ఆగ్నేసమ్మ ఆలయ 119వ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో కులమతాలకతీతంగా ఈ పండగను జరుపుకున్నారు. పండుగ ప్రత్యేక దివ్యపూజాబలిని ఆలయంలో గుంటూరు మేత్రాసనం పీఠాధిపతులు డాక్టర్ చిన్నాబత్తిన భాగ్యయ్య నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సర్వమానవావళి పాపపరిహారార్థం సర్వసృష్టికర్త అయిన ఏసుక్రీస్తు ప్రభువు మరియమ్మ గర్భానా జన్మించాడని తెలిపారు. దైవభక్తి పాటలను మహిళలు భక్తిశ్రద్ధలతో ఆలపించారు. భక్తులు కొవ్వొత్తులు సమర్పణ, రాత్రికి గ్రామ పురవీధుల్లో మేళతాళాల నడుమ, బాణసంచా పేలుస్తూ ప్రత్యేక ఊరేగింపు నిర్వహించారు. సమీప గ్రామాల నుంచి భక్తులు వేలాదిగా తరలి వచ్చి తమ మొక్కుబడులు చెల్లించుకున్నారు. పండుగ పురస్కరించుకుని ఆలయాన్ని రంగు,రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. కార్యక్రమంలో పేరేచర్ల విచారణ గురువు నుదురుపాటి చంద్రమోహన్, జిల్లాలోని పలు విచారణ గురువులు, ఫాదర్లు, మతకన్యలు పాల్గొన్నారు.

వేగం కన్నా భద్రత మిన్న:జేసీ



పట్నంబజారు: జాతీయ రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా శనివారం స్వర్ణభారతీనగర్‌లోని ఆర్టీవో కార్యాలయంలో లారీ, బస్సు డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు, రక్తదాన శిబిరం నిర్వహించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ జి. రాజకుమారి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్. ప్రభావతి ముఖ్య అతిథులుగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. జేసీ రాజకుమారి స్వయంగా రక్తదానం చేసి, రక్తదాతల్లో ఉత్సాహాన్ని నింపారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా రాజకుమారి మాట్లాడుతూ అతి వేగం కన్నా భద్రత ఎంతో ముఖ్యమన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గమనించాలని సూచించారు. ఏకాగ్రతను ఎట్టి పరిస్థితుల్లోనూ కోల్పోకూడదని, డ్రైవర్లకు సూచించారు. ప్రతి డ్రైవర్ వెనుక ఎంతో మంది విలువైన ప్రాణాలు ఉన్నాయనే విషయాన్ని మరవకూడదని చెప్పారు. వాహనాల్లో సైతం పరిమితికి మించి ప్రయాణికుల్ని ఎక్కించకూడదని తెలిపారు. మద్యం తాగడం, సెల్‌ఫోన్ డ్రైవింగ్ వంటివి ప్రమాదాలకు కేంద్ర బిందువులుగా నిలుస్తాయని చెప్పారు. హైవేల్లో సైతం నిబంధనలు పాటిస్తూ, రహదారి భద్రతను ప్రతి ఒక్కరూ తప్పని సరిగా పాటించాలని ఆమె సూచించారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్. ప్రభావతి మాట్లాడుతూ ప్రయాణంలో ఐదు నిముషాల ఆలస్యం వల్ల వచ్చే నష్టం కంటే, త్వరగా గమ్యాన్ని చేరుకోవాలన్న తొందరపాటే ప్రమాదాలకు దారితీస్తుందన్నారు. ర్యాష్, స్నేక్, త్రిపుల్ డ్రైవింగ్‌లు ఏ మాత్రం సరికాదని యువతకు సూచించారు. డీటీసీ షేక్ కరీం మాట్లాడుతూ నిబంధనలు పాటించని వాహనాల డ్రైవర్లపై చర్యలతో పాటు జరిమానాలు కూడా విధిస్తామని తెలిపారు. ప్రతి ఒక్కరూ నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎంవీఐలు, డ్రైవర్లు, ఆర్టీవో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

నా క్లయింట్లు అయిన 1)గుంటూరు జిల్లా, దుగ్గిరాల మండలం, దుగ్గిరాల గ్రామానికి చెందిన లేటు బొల్లు సుబ్బారావు గారి కుమారుడు బొల్లు లలితానంద ప్రసాద్ 2) గుంటూరు జిల్లా, మంగళగిరి మండలం, చినకాకాని గ్రామానికి చెందిన బొర్రా రంగారావు గారి భార్య బొర్రా రత్న సరోజిని, 3)భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, చర్ల మండలం, తాగాడ గ్రామానికి చెందిన కొసరాజు తిరుపతిరావు గారి భార్య ఉమారాజేల సంజాయిషీ మేరకు ఈ దిగువ నోటీసును జారీచేయడమైనది.

దిగువ తెలిపిన ఆస్తులను గురించి నా క్లయింటు మహారాజశ్రీ తెనాలి సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో O.S.No. 67/2022 అను దావాను వేసి, సదరు ఆస్తులు వారికి చెందిన జాయింటు ఆస్తులు అని ... [illegible] సదరు దావాలోని ప్రతివాదులు మరియు గద్దిపాటి రమేష్‌బాబు, గద్దిపాటి చైతన్య కృష్ణ, గద్దిపాటి సునీత, గద్దిపాటి పవన్ గద్దిపాటి తనూజ మరియు అనుమోలు సాంబ్రహ్మాజ్యం, అనుమోలు శైలజ, అనుమోలు సతీష్‌లు కలిసి దిగువ తెలిపిన ఆస్తులను దిగువ తెలిపిన వెల్లని దస్తావేజులతో ఇతరుల పేర్లతో దస్తావేజులు సృష్టించడానికి మరియు ఇతరులకు అన్యక్రాంతం చేయడానికి ప్రయత్నములు చేయుచున్నారని, వాస్తవానికి సదరు ఆస్తులు నా క్లయింట్లకు కూడా జాయింటు స్వాధీన అనుభవ హక్కులు ఉన్న ఆస్తులు అయివున్నవి. నా క్లయింట్ల సమ్మతి మరియు సంతకములు లేకుండా సదరు ఆస్తులను ఎవరూ అన్యక్రాంతములు చేయడానికి వీలులేదని యిందు మూలముగా తెలియజేయడమైనది. దానికి విరుద్ధంగా ఎవరైనా సదరు ఆస్తులను గురించి క్రయవిక్రయములు చేసినను, వారెందరూ కూడా నా క్లయింటు తీసుకోబోయే సివిల్ క్రిమినల్ చర్యలకు బాధ్యులు కావలసి వస్తుందని ఈ బహిరంగ నోటీసులు జారీచేయడమైనది.

గుంటూరు జిల్లా, దుగ్గిరాల మండలం, దుగ్గిరాల సబ్‌రిజిస్ట్రారు, చినపాలెం గ్రామం

వ.నెం.	డి.నెం.	విస్తీర్ణం	దస్తావేజు తేది	రిజిస్టరు దస్తావేజు నెంబరు	సబ్‌రిజిస్ట్రారు వారి కార్యాలయం	వెల్లని దస్తావేజు కలిగియున్న వారు
1	203/1 203/1	ఎ.1.00సెంట్లు ఎ.1.00సెంట్లు	14-07-2010 20-04-2011	2152/2010 985/2011	దుగ్గిరాల	గద్దిపాటి యశోదమ్మ ముసుహూరు పద్మ
2	203/1	ఎ.1.16సెంట్లు	29-04-2015	996/2015	దుగ్గిరాల	గద్దిపాటి చైతన్యకృష్ణ
3	202/6	ఎ.0.16సెంట్లు	28-05-2015	607/2015	కొల్లిపర	వాగ్దర్లమూడి గంగాధరరావు
4	210/1	ఎ.0.56సెంట్లు	28-05-2015	607/2015	కొల్లిపర	వాగ్దర్లమూడి గంగాధరరావు
5	202/6	ఎ.0.16సెంట్లు	28-05-2015	608/2015	కొల్లిపర	వాగ్దర్లమూడి హేమంతరావు
6	210/1	ఎ.0.56సెంట్లు	28-05-2015	608/2015	కొల్లిపర	వాగ్దర్లమూడి హేమంతరావు
7	202/6	ఎ.1.00సెంట్లు	28-05-2015	609/2015	కొల్లిపర	అనుమోలు వెంకట సుబ్బారావు
8	210/1	ఎ.0.82సెంట్లు	13-08-2016	4099/2016	నరసరావుపేట	వాగ్దర్లమూడి గంగాధరరావు
9	210/1	ఎ.0.85సెంట్లు	17-08-2016	4142/2016	నరసరావుపేట	వాగ్దర్లమూడి హేమంతరావు
10	9/2	ఎ.0.68సెంట్లు	17-08-2016	4250/2016	నరసరావుపేట	మాదినేని రామసీతమ్మ
11	9/2	ఎ.0.86సెంట్లు	17-08-2016	4250/2016	నరసరావుపేట	మాదినేని రామసీతమ్మ
12	9–2ఎ 9–2బి	ఎ.0.34సెంట్లు ఎ.0.14సెంట్లు ఎ.0.48సెంట్లు	03-10-2016	11291/2016	మంగళగిరి	గద్దిపాటి సాంబశివరావు (లేటు)
13	9–2ఎ 9–2బి	ఎ.0.34సెంట్లు ఎ.0.14సెంట్లు ఎ.0.48సెంట్లు	03-10-2016	11292/2016	మంగళగిరి	అనుమోలు లీలా కృష్ణ (లేటు)

గుంటూరు జిల్లా, దుగ్గిరాల మండలం, దుగ్గిరాల సబ్‌రిజిస్ట్రారు, పేరుకలపూడి గ్రామం

వ.నెం.	డి.నెం.	విస్తీర్ణం	దస్తావేజు తేది	రిజిష్టరు దస్తావేజు నెంబరు (SRO)	వెల్లని దస్తావేజు కలిగియున్నవారు
1	20/5	ఎ.0.30 1/2 సెంట్లు	29-04-2015	994/2015 (దుగ్గిరాల)	గద్దిపాటి సాంబశివరావు (లేటు)
2	21	ఎ.0.20 1/2 సెంట్లు	29-04-2015	994/2015 (దుగ్గిరాల)	గద్దిపాటి సాంబశివరావు (లేటు)
3	20/5	ఎ.0.81 3/4 సెంట్లు	29-04-2015	994/2015 (దుగ్గిరాల)	గద్దిపాటి సాంబశివరావు (లేటు)
4	20/5	ఎ.0.30 1/2 సెంట్లు	29-04-2015	995/2015 (దుగ్గిరాల)	అనుమోలు లీలాకృష్ణ (లేటు)
5	21	ఎ.0.20 1/2 సెంట్లు	29-04-2015	995/2015 (దుగ్గిరాల)	అనుమోలు లీలాకృష్ణ (లేటు)
6	20/5	ఎ.0.81 3/4 సెంట్లు	29-04-2015	995/2015 (దుగ్గిరాల)	అనుమోలు లీలాకృష్ణ (లేటు)
7	108-8 డోర్ నెం. 2-42, అసెస్మెంటు నెం.225 ఆర్.సి.సి దాబాయిల్లు	చ.గ. 873.5లు	28-05-2015	610/2015 (కొల్లిపర)	(1) వాగ్దర్లమూడి హేమంతరావు (2) వాగ్దర్లమూడి గంగాధరరావు (3)అనుమోలు లీలాకృష్ణ (లేటు) (4)అనుమోలు వెంకట సుబ్బారావు (5) గద్దిపాటి రమేష్‌బాబు (6) గద్దిపాటి సాంబశివరావు (లేటు)

మంగళగిరి.
తేది. 21-01-2023

గాదంశెట్టి రామకృష్ణ, అడ్వకేట్
మంగళగిరి